క్లుప్తంగా

ఆర్టీసీ డిపోలో సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఆర్టీసీ డిపోలో సీపీఆర్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 100 మంది ఉద్యోగులకు ప్రభుత్వ వైద్యుడు భానుప్రసాద్ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులతో పాటు డిపో మేనేజర్ శ్రీనివాస్, డిపో సీఐ రామయ్య, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

షిర్డీకి తరలిన చింతగుర్తి వాసులు

రఘునాథపాలెం: మండల పరిధిలోని చింతగుర్తి గ్రామస్తులు సామూహికంగా షిర్డీ యాత్రకు తరలివెళ్లారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తమ్మిని నాగేశ్వరరావు తన సొంత ఖర్చులతో 650 మంది గ్రామస్తులను షిర్డీ యాత్రకు శనివారం తీసుకెళ్లారు. షిర్డీ వెళ్లే వారికి వసతి ఏర్పాట్లతో పాటు తిరుగు ప్రయాణానికి కూడా టిక్కెట్లు బుక్ చేసినట్లు సర్పంచ్ చెప్పారు. గతంలో గ్రామస్తులను తిరుపతి, కాళేశ్వరం సందర్శనకు కూడా తీసుకెళ్లడం విశేషం. గ్రామస్తులంతా షిర్డీకి తరలడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. తరలివెళ్లిన వారిలో ఎంపీటీసీ మాలోత్ లక్ష్మి దంపతులు, గోపయ్య, తదితరులు ఉన్నారు.

పుస్తెలు, మెట్టెలు వితరణ



వితరణ చేస్తున్న వెంకటేశ్వర్లు దంపతులు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన ఉపసర్పంచ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వర్లు, చంద్రకళ దంపతులు గ్రామానికి చెందిన నిరుపేద యువతి కాస్తాల శిరీష వివాహానికి శనివారం పుస్తెలు, మెట్టెలను వితరణగా అందించారు. గత కొన్ని మాసాలుగా గ్రామంలో కులమతాలకతీతంగా నిరుపేద యువతుల వివాహానికి తమ వంతు ఈ వితరణ చేస్తున్నామని, అంతేకాక నిరుపేద చనిపోతే వారి కుటుంబానికి బియ్యం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కాలింగి వీరబాబు, గాడిచర్ల సత్యనారాయణ, యాకూమీయా, కోలాట మహిళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగులు..



గొడుగు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని చిరు వ్యాపారులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం గొడుగులు వితరణ చేసినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్.రషీద్ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఫాస్ట్ ఎక్స్
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	అన్ని మంచి శకునములే
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	60		10
కాకర	50	చుక్కకూర	2
సోర కాయం	16		10
బీర	40	తోటకూర	2
దొండ	20		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	24	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	46		15
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	



వేసవి కాలంలో మాత్రమే దొరికే తాటి ముంజలను ఇష్టపడనివాళ్లు ఉండరు. మృదువుగా ఉండే వీటిలో పోషకాలు కూడా ఎక్కువే. అధిక శాతం నీరు ఉండడంతో దాహార్తిని కూడా తీర్చుకోవచ్చు. వేసవిలో ఆరోగ్య ప్రధాయని వైద్యులు చెబుతుండడంతో.. మార్కెట్‌లో వీటికి మంచి గిరాకీ ఉంటోంది. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించడంతో వీటిని ఐస్ ఆపిల్ అని కూడా అంటారు. పల్లెల్లో నుంచి వీటిని పట్టణాలకు తీసుకొచ్చి రహదారుల వెంట కొందరు అమ్ముకుంటూ ఉపాధి పొందుతున్నారు. అయితే తాటి ముంజలు తినడం కూడా ఓ స్టైలే. పట్టణాలు, నగరాల్లో స్పూన్లు, ఫోర్కులతో తింటారు కానీ, పల్లెల్లో అప్పటికప్పుడు తాటికాయ ఒలిచి బొటన వేలితో తీసుకుని తింటుంటే ఆ మజాయే వేరు. అటువంటి తాటి ముంజలపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

తాటి ముంజల మజా..!

వేసవి తాపానికి ఉపశమనం

- ఎక్కడ చూసినా ముంజల విక్రయాలే..
- చలువనివ్వడంతో పెరిగిన గిరాకీ
- డజను రూ.60 నుంచి ఆపైనే
- ఉపాధి పొందుతున్న పలువురు

సండే స్పెషల్

ఖమ్మంగాంధీచౌక్: వేసవి తాపాన్ని తీర్చే తాటి ముంజలను పల్లె ప్రాంతాల నుంచి కొందరు ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలపై తాటి కాయలు, ముంజలను తీసుకొచ్చి నగరంలోని రహదారులు వెంట పలు కేంద్రాలను అడ్డాలుగా చేసుకొని అమ్ముతుంటారు. నగరంలో వైరారోడ్, బస్ డిపో రోడ్, కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ రోడ్, ముస్తఫానగర్, బోనకల్ రోడ్, చెరువు బజార్, ఇల్లెందు క్రాస్‌రోడ్, తెలుగు తల్లి విగ్రహం, బైపాస్ రోడ్, రాపర్తినగర్, బల్లేపల్లి తదితర ప్రాంతాలతో పాటు కూసుమంచి, కోదాడ, ఇల్లెందు రహదారుల వెంట ముంజల విక్రయాలు జరుగుతున్నాయి. నల్లగొండ జిల్లా నడిగూడెం, మోతె, ఆత్మకూరుతో పాటు సూర్యాపేట, తదితర మండలాల నుంచి తాటి కాయలను తీసుకువచ్చి వినియోగదారుల ముందే ముంజలు తీసి కొందరు విక్రయిస్తుండగా.. మరికొందరు ఇంటి వద్ద ముంజలు తీసి బుట్టల్లో తీసుకొచ్చి అమ్ముతున్నారు.



ఇల్లెందు క్రాస్ రోడ్‌లో ముంజల విక్రయాలు ఇలా

తింటే ప్రయోజనాలిలా..

- శరీరంలో వేడిని తగ్గిస్తుంది.
- శరీరాన్ని డీహైడ్రేషన్ నుంచి కాపాడుతుంది.
- ఆటలమ్మ/అమ్మవారు వంటి వాటిని తగ్గిస్తుంది.
- గర్భిణులకు ఎసిడిటి సమస్యలను తగ్గిస్తుంది.
- జీవక్రియ, మలబద్ధకం వంటి సమస్యలను తొలగిస్తాయి.
- కాలేయం, బ్రెస్ట్ కేన్సర్ నివారణకు దోహదపడుతుంది
- బరువు తగ్గిస్తుంది.

పెరిగిన గిరాకీ..

ఎండ తీవ్రత నుంచి చలువనిచ్చే ముంజలను తినడానికి ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. వైద్యులు కూడా సలహా ఇవ్వడంతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది విక్రయాలు పెరగటమేగాక, ధర కూడా పెరిగింది. గత ఏడాది డజను ముంజలు రూ.40 ఉంటే ఈ ఏడు రూ.60లు ఆపైన ప్రాంతాన్ని బట్టి విక్రయిస్తున్నారు. అయినా సామాన్యులు మొదలు అన్ని వర్గాల ప్రజలు ఈ ముంజలు కొంటున్నారు.

ఎండాకాలంలో ఉపాధి..



తాళ్ల గీయడం మా కుల వృత్తి. ఎండా కాలంలో తాటి గెలలను కోసి ఆటోలో ఖమ్మానికి తీసుకొచ్చి వినియోగదారుల ముందే ముంజలు తీసి విక్రయిస్తుంటాం. ప్రతి ఏటా ఇంటిల్లిపాది ముంజల విక్రయాలు చేస్తుంటాం. వేసవిలో కూలీ గిడుతుంది. వర్షం పడిన రోజు అంతగా ముంజలు అమ్మకం కావు.

– గందు నాగేశ్వరరావు, బిందాలపురం, నడిగూడెం మండలం, సూర్యాపేట

శరీరాన్ని చల్లబరుస్తాయి..



ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేందుకు ముంజలు తింటుంటాం. నిత్యం ఎండలో తిరుగుతుంటాం కాబట్టి ఉపశమనం కోసం ముంజలు కొని తింటాం. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే ముంజలను కొందరు నగర ప్రాంతాలకు తీసుకొచ్చి విక్రయించడం వినియోగదారులకు వరమనే చెప్పొచ్చు.

– సోమరపు సుధీర్‌కుమార్, ప్రకాశ్‌నగర్, ఖమ్మం

వడదెబ్బ నుంచి రక్షిస్తాయి..



ముంజలు వడదెబ్బత నుంచి రక్షిస్తాయి. పోషకాలు మెండుగా ఉండడంతో రక్తపోటును అదుపు చేస్తుంది. శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగించడంలో ఎంతగానో దోహదపడతాయి. ప్రతి వేసవిలో ముంజలను తప్పక తింటాం. ప్రకృతి సిద్ధంగా లభించే వీటిని పిల్లలకూ అలవాటు చేయాలి.

– దొడ్డ ప్రభాకర్ రావు, విశ్రాంత ఉద్యోగి, పంచాయతీరాజ్ శాఖ, ఖమ్మం

నేడు జెడ్పీ హాల్‌లో కృతజ్ఞత సభ



మాట్లాడుతున్న రాంనారాయణ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల నెరవేర్చిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు కృతజ్ఞతగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో సభ ఏర్పాటు చేసినట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ తెలిపారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సభకు జర్నలిస్టులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షుడు మైసా పాపారావుతో పాటు మాటేటి వేణుగోపాల్, ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నాగండ్ల శివానంద, చెరుకుపల్లి శ్రీనివాస్, మోహినుద్దీన్, నలజాల వెంకట్రావు, వై.మాధవరావు, తాళ్లూరి మురళి, జనార్దనాచారి, నామ పురుషోత్తం, బసవేశ్వరరావు, వాసు, భూపాల్, మహేందర్, అయ్యప్ప, కమటం శ్రీను, మేడి రమేష్, భవానిసింగ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

నేడు కరెంట్ కట్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని టౌన్-5 పరిధిలోని 33/11 కేవీ రామాలయం సబ్ స్టేషన్ 11 కేవీలో కమాన్‌బజార్ ఫీడర్ నుంచి సబ్ స్టేషన్ వరకు లైన్ క్లియరెన్స్ పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమాన్ బజార్, కస్బా బజార్, వల్లాల వారి వీధి, షాదీఖానా, స్టేషన్ రోడ్, బొమ్మన సెంటర్, శాంతి లాడ్జ్, వినోద థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

తుంగతుర్తి ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి

నేలకొండపల్లి: దళితులను అవమాన పరిచే విధంగా వ్యాఖ్యానించిన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు తోళ్ల సురేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత బంధులో జరిగిన అవినీతిని ప్రశ్నిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులపై అధికార అహంకారంతో ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఆయన మాటలను ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మండల అధ్యక్షుడు కుక్కల రవీంద్రబాబు, కనకంపూడి రవి, బండి కరుణాకర్, మారేపల్లి చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ట్రిపుల్ ఆర్' సెంటర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: మేరీ లైఫ్.. మేరీ స్వచ్ఛ షెహర్‌లో భాగంగా నగరంలోని అన్ని డివిజన్‌లలో నిరుపయోగ వస్తువులను తగ్గించడానికి ట్రిపుల్ ఆర్(రీయూజ్, రీసైకిల్, రెడ్యూస్) సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శనివారం 53వ డివిజన్‌లో కేఎంసీ కార్యాలయం వెనుక భాగంలోని ప్రాంతంలో ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరాలు, పట్టణాలను మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సరికొత్త కార్యక్రమం ఈ నెల 20 నుంచి జూన్ 5వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచి ఫలితాలు సాధించిన మున్సిపాలిటీలకు ఢిల్లీలో జూన్ 10న అవార్డుతో సత్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మసీద్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



సన్మానిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని మసీద్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని బీజేపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ షర్ఫుద్దీన్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో శనివారం జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు షాజాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం సన్మానించారు. ఖమ్మం జిల్లాలో మైనారిటీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం షర్ఫుద్దీన్ మాట్లాడుతూ.. మసీద్‌లకు ప్రహరీ గోడల నిర్మాణం, కబరస్థాన్ నిర్మాణాలకు కమిషన్ నుంచి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యాకూబ్‌పాషా, నేలకొండపల్లి మండల మైనారిటీ మోర్చా అధ్యక్షుడు సయ్యద్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జ్యూస్ పాయింట్ వద్ద ఘర్షణ

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో జ్యూస్ పాయింట్ వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. మండలంలోని శంకరగిరితండా పంచాయతీ పరిధి కట్టుకొమ్మతండాకు చెందిన ఇరువర్గాల వారు రాజేశ్వరపురంలో జ్యూస్ పాయింట్లు నిర్వహిస్తున్నారు. వ్యాపారం విషయమై శనివారం వివాదం నెలకొనగా పరస్పరం దాడి చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



సేకరించిన రక్తంతో ఎన్టీఆర్ అభిమానులు

ఖమ్మంగాంధీచౌక్: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో కాల్వొడ్డు యూత్ ఆధ్వర్యాన శనివారం కేక్ కట్ చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు ఎస్‌కె. జకీర్, ఎస్‌కె. మహ్మద్ పాషా, నజీర్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని తిరుమల థియేటర్‌లో ఆయన అభిమానులు తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, సతీష్, గోపి, జాన్‌బాబు, గోపాల్ రెడ్డి, శివారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టడంపై అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని కొత్తూరులో గల డేర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్షం నీటిని ఒడిసి పట్టడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కిరణ్ మాట్లాడుతూ.. ప్రతీ నీటి బొట్టును కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు మంచి చేసినవారమవుతామని ఆ దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వలంటీర్ ఉష తదితరులు పాల్గొన్నారు.

ధరణిలో లోపాలు సవరించండి



తహసీల్దార్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల

కూసుమంచి: ధరణిలో తలెత్తుతున్న సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అట్టి సమస్యలు రాకుండా చూడాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి సూచించారు. శనివారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల తహసీల్దార్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రెవెన్యూపరంగా ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్లరేషన్ కార్డులు అందేలా చూడాలని, నియోజకవర్గంలోని జర్నలిస్ట్‌లకు ఇళ్ల స్థలాల కోసం స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు మీనన్, సుమ, ప్రసాద్, పుల్లయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన..

నేలకొండపల్లి/ కూసుమంచి: మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించారు. మంగాపురం తండాలో లెవన్ స్టార్ క్రికెట్ అసోసియేషన్-కందాల యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అలాగే పైనంపల్లిలో నిర్వహించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయం వార్షికోత్సవంలో బోనమెత్తి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఓ వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.అలాగే కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం శ్రీకంఠమేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, జెడ్పీటీసీ ఇంటూరి బేబి, సర్పంచ్ కొండా సత్యం, ఎంపీటీసీ అంబాల ఉమా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు ఉండొద్దు



నీటి నిల్వలను పరిశీలిస్తున్న సీఈఓ

రఘునాథపాలెం: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు, తాగు నీటి సరఫరాకు అంతరాయం, లీకులు లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఈ.అప్పారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని కోయచలక, చిమ్మపూడి, వీఆర్‌బంజర తదితర గ్రామ పంచాయతీల్లో పర్యటించి ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, నర్సరీల నిర్వహణ, ఆయా పంచాయతీల్లో రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్నేరుపై కొత్త బ్రిడ్జి నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని త్రీటౌన్ ప్రాంతం కాల్వొడ్డులో మున్నేరుపై కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎర్ర శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం త్రీటౌన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నేరుపై కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం జనవరిలోనే ఉత్తర్వులు ఇచ్చినా నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. గోళ్లపాడు చానల్ పనులు పూర్తి చేయాలని, త్రీటౌన్ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు భూక్యా శ్రీనివాస్, బండారు యాకయ్య, షేక్ సైదులు, తుశాకుల లింగయ్య, పత్తిపాక నాగసులోచన, శీలం వీరబాబు, బండారు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏదులాపురం సొసైటీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం



నియామక పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి

ఖమ్మంరూరల్: ఏదులాపురం సహకార సంఘం చైర్మన్‌గా గుండాలతండాకు చెందిన బీఆర్ఎస్ అభ్యర్థి జర్పుల లక్ష్మణ్‌నాయక్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయుడుపేటలోని సంఘం కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు నామినేషన్లు తీసుకున్న అధికారులు మధ్యాహ్నం 2 గంటల వరకు ఉపసంహరణకు గడువిచ్చారు. కాగా బీఆర్ఎస్ నుంచి లక్ష్మణ్‌నాయక్‌తో పాటు నామినేషన్ దాఖలు చేసిన మరో డైరెక్టర్ మేదరమెట్ల శ్రీనివాస్ ఉపసంహరించుకోవడంతో అధికారులు లక్ష్మణ్‌నాయక్ ఏకగ్రీవం చేశారు. అనంతరం ఎన్నికల అధికారి కిశోర్ చైర్మన్‌కు నియామక పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే కందాలను చైర్మన్‌తో పాటుఇతర డైరెక్టర్లు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏకపక్ష ధోరణిలో కూలి రేట్ల పెంపు



మాట్లాడుతున్న మనోరమ శ్రీనివాస్

ఖమ్మంమయూరిసెంటర్: సుతారి మేస్త్రీల కూలి రేట్లను ఏకపక్షంగా పెంచడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సిటీ గృహ నిర్మాణదారులు మనోరమ శ్రీనివాస్, ఇతర గృహ నిర్మాణదారులు పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మంలో సుతారి యూనియన్ ఈనెల 15న వారి కూలి రేట్లను 25శాతం పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల ఇంటి నిర్మాణం ఒక కలలాగా మిగిలిపోయిందనిఆవేదన వ్యక్తం చేశారు. సుతారీల 8 గంటల పనివిధానం కూడా అమలు కావడం లేదని, 6 నుంచి 6.30 గంటలు మాత్రమే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. బిల్డర్ అసోసియేషన్ చేస్తున్న సమ్మెకు తాము పూర్తి మద్దతునిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌడవరపు హర్షవర్ధన్, నెల్లూరి ఉదయ్ కిరణ్, మోరంపూడి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు బీభత్సం



ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం

ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురియడంతో శనివారం రాత్రి పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారమైంది. కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు మారిన వాతారణం కొంత ఉపశమనం కలిగించినా.. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడడం, విద్యుత్ లైన్లు తెగిపడడంతో చిమ్మ చీకట్ల మధ్య రహదార్ల వెంట ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్లను పరిశీలిస్తూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనిలో పడ్డారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్